# సద్దుల బండ

బి. మురళీధర్

**పచ్చపచ్చని పందిరుల కింద – పత్తి విత్తులన్నీ పడరాసివోసీ**
**గొబ్బూపెండాదెచ్చి గోలెంల గలిపి – తెల్లనీ విత్తనము సల్లవడరాసీ**
**ఎత్తిరీ విత్తనము ఎండీ గంపలల్ల – పట్టిరీ విత్తనము పైడీ గంపలల్ల**
**శ్రీరాముడు గొర్రువట్టు సేతసాలేసూ – అన్నయ్యగోరు వట్టు వదినెసాలేసూ**
**ముత్తైదులేసినా మూడు రోజులకూ – ఆకుపచ్చనాయె అవ్వామనసేనూ!**

నల్లని రేగడిచేను. తెల్లని నిలువెత్తు దుక్కిటెడ్ల అరక – అరకపట్టేవాడు శ్రీరాముడనీ, విత్తనంతో సాలు వేసేది సీతమ్మ అనీ, పుట్టింటి బిడ్డ లక్షుమమ్మ – అన్నా వదినెలలో సీతారాములను చూసుకొని హృదయంలో నుండి ఉబికి వచ్చిన భావాలను ఎలుగెత్తి, సన్నని కంఠంతో పాడుతున్న పాటను – గట్టు మీద, గున్నమామిడి చెట్టుమీద కోయిల, బిత్తరపోయి చెవులు రిక్కించి వింటున్నవేళ! ఆ గానానికి బసవన్నలు తమ మెడలోని గంటలను లయబద్ధంగా మోగిస్తూ, సాలు తప్పకుండా. అపశృతి మ్రోగకుండా, ఒకానొక పరవశత్వంలో నడుస్తున్న వేళ! – అన్నాళ్ళూ నిద్రావస్థలో వున్న విత్తనాలు, రైతమ్మ మాతృస్పర్శతో మెలకువలోకి వచ్చి, గలగలలాడుతూ, మొలకెత్తడానికి మోసులేస్తూ, జడ్డిగామలో నుండి ఒకొక్కక్కటిగా నేలతల్లి ఒడిలోనికి జారుతున్న వేళ! – ప్రకృతి పులకరించి తాను సైతం ఆనందాశ్రువులు వర్షిస్తే, అవి చిరుజల్లుల రూపంలో అందరినీ తడిపేయడంతో – ఇక విత్తనపోత సాధ్యం గాక అందరూ అరకను ఆపేసి రావిచెట్టు కింది సద్దుల బండ మీదకు చేరుకున్నారు.

పుష్యకార్తెలో వర్షం అప్పుడప్పుడు చిరుజల్లులుగా వచ్చి పలకరించి పోతుంది ఆ చిరుజల్లులు భూమిలోని విత్తనాలకు తల్లిపాల లాంటివి. పడ్డ విత్తు పడ్డట్టుగా మొలకవుతుంది.

మొదటి విత్తనం వేసేరోజు ఇంటి ఆడ బిడ్డ చేత్తో వేస్తే పుష్కలంగా పంట పండుతుందని, ప్రత్యేకంగా అత్తవారింటినుండి చెల్లెలు లచ్చుమమ్మను పిలిపించి, ఆచారానికి అయిదుసాళ్ళ పోత పోయించి, చీర, రవికా కట్నం బెట్టి, కాళ్ళుమొక్కి సాగనంపడం శివయ్య చాలా ఏళ్ళుగా ఆచరిస్తున్న ఆచారం. శివయ్యనే గాక ఆ ప్రాంత ప్రజలంతా ఆ రకంగానే తమ ఆడబిడుచులను గౌరవిస్తారు.


సద్దులబండ మీద కూర్చొని, అన్నావదినెలతో కట్నం అందుకున్న లచ్చుమమ్మ ఆనందభాష్పాలు రాల్చి 'ఎప్పటికీ గింతేప్రేమ ఉంటే సాలని' పుట్టినిల్లు భోగభాగ్యాలతో తులతూగితేనే తనకు కొండంత అండ అన్నది.

''సద్దుల యాల్లయింది! భూమి గొంచెం పచ్చిగున్నది. ఆరే దాకా సద్దులు దినేస్తే అయిపాయ! ఇగ పోత ఆపకుండా పొయ్యచ్చు!'' శివయ్య అందరితో అన్నాడు. శివన్న మాటతో అందరూ పక్కనేవున్న లేత మోదుగాకులు చెరి నాలుగు తెంపుకొని మోటబావి దగ్గర కడుక్కొని సద్దులబండ మీద వరుసగా కూర్చున్నారు. వీళ్ళని దూరం నుండే చూసిన చుట్టుపక్కల రైతులందరూ 'సద్దులయ్యాలయింది నడుండ్రి!' అనుకుంటూ గుంపులు గుంపులుగా సద్దులబండ దగ్గరకు చేరుకుంటున్నారు. కొంచెం సేపటికి రావిచెట్టు కింది సద్దులబండ సందడి సందడిగా మారిపోయింది.

ఆ చుట్టుప్రక్కల ఎక్కడా మంచినీళ్ళ బావిలేక పోవడంతో శివయ్య చేండ్లోని ఊట నీళ్ళ మోటబావే అక్కడి రైతులందరికీ ఆధారం. శివయ్యకు తన తాత ముత్తాతల నుండి సంక్రమించింది నాలుగెకరాల అసలైన మాగాణి. తన రెక్కలు ముక్కలు చేసుకొని దానిని సస్యశ్యామలమైన తోటగా మార్చాడు శివయ్య. కమతం మధ్యలో పెద్దదిగుడు బావి. ఆ బావికి మోట బొక్కెన. బావిగట్టున పెద్దచింత మాను, దానిప్రక్కనే రెండు మంచిరసాల ముంత మామిడిచెట్లూ – బావికి మరొక పక్క మూడు కాలాలూ పచ్చగా ఉండే తమలపాకు తోట – కొంచెం దిగువన ఒక పెద్ద రావిచెట్టూ ఉన్నాయి.


ఆ రావి చెట్టు కిందనే సద్దులబండ ఉన్నది. నిజానికి ఆ చెట్టుకింద ఏ కాలంలోనో కట్టిన చిన్నదేవాలయమేదో ఉండేదేమో! అక్కడక్కడ శిథిలమైన శిల్పాల ఆనవాళ్ళు కనిపిస్తాయి. రావిచెట్టు కింద మాత్రం దాదాపు ఇరవై అడుగుల పొడవూ, పదడుగుల వెడల్పు గల చదునైన శిల ఉండిపోయింది. ఆ శిల కుడ్యభాగానికి కొన్ని శిల్పాలు అసంపూర్తిగా చెక్కబడి వున్నాయి. ఆ శిలమీద మట్టి అంటకుండా కూర్చొని సద్దులు తినే సౌకర్యం ఉండటంతో ఆ చుట్టుపక్కల రైతులంతా మధ్యాహ్నం అక్కడికే చేరుకుంటారు. అందుకే దానికి సద్దులబండ పేరు ఖాయమై పోయింది.

ఆ సద్దులబండ మీద ఒకరి సద్దులు మరొకరు పంచుకోవడమే గాకుండా సమస్యలను కూడా అంతే ఆర్తితో పంచుకొని, నలుగురు కలిసి చక్కని పరిష్కారాన్ని కనుక్కోవడమూ జరుగుతుంది.



ఆ సద్దులబండకు మరొక ప్రత్యేకత కూడా వుంది. దాని కుడ్య భాగాన చాలా శిల్పాలు అసంపూర్తిగా చెక్కి వుండటం వలన అంత స్పష్టంగా లేవు గానీ. ఒక్క శిల్పం మాత్రం నాలుగడుగుల ఎత్తుండి పూర్తిగా చెక్కి వుంది. ఆ శిల్పం. తరుల్లతల్లాగా నిలువెల్లా పెనవేసుకుపోయిన శివపార్వతుల ఆలింగనా దృశ్యం! చూపు తిప్పుకోలేనంత అందంగా వున్న ఆ అద్భుత శిల్పం – సద్దులబండ మీదకు చేరిన పడుచు వాళ్ళని మరింత సమ్మోహన పరుస్తుంది! కట్టుబాటు మీరకుండా, చూపులతో పలకరించు కోవడం మాత్రమే తెలిసిన పల్లెటూరి పడుచు జంటలకు, ఆ శిల్పం అప్పుడప్పుడు – మాటలు నేర్పుతుంది.

''శివయ్య మామా! కాలం ఎట్లున్నదట ఇయ్యేడు!'' ఎవరో అడిగారు. ''ఇయ్యేడు కాలం గొంచెం ఎక్కున్నదట! అయినా పంటలు మంచిగనే పండుతయని అయ్యగారు పంచాంగం సూసి సెప్పిండు! ఆన కాలం బాగుంటే జొన్నలు బూజెక్కుతయి. గందుకే ఇయ్యోడు జొన్నపోత ఎం(దొ)ద్దుల ముందు వొయ్యాల!'' పంచాగకర్త చెప్పిన వాతావరణ సూచన మీద ఆధారపడే శివయ్య మిగతా



వారితో తన అనుభవాలు పంచుకుంటున్నాడు.

''మనుసులల్ల నియ్యతుంటే, ధర్మం కొద్ది నడుసుకుంటే కాలం గూడా నియ్యతు (నీతి) కొద్ది నడుస్తది. కాలమెన్నడు మనకు ధోకా జెయ్యలే!''

''ఆవు మరి! మనం దిని నలుగురికి వెడ్తున్నమంటే కాలం సాధిచ్చినట్లే!'' ఎవరికి తోచిన అనుభవాలను వాళ్ళు చెప్తున్నారు. ఆడా, మగా పడుచు వాళ్ళంతా గుంపులు గుంపులుగా విడిపోయి, ఒకరినొకరు దొంగ చూపులు చూసుకుంటూ ముచ్చట పడిపోతున్నారు. నడీడు వాళ్ళు కొందరు శివయ్య తమలపాకు తోట్లోంచి చెరో రెండు లేత తమలపాకులు తుంచుకొని వచ్చి, దానిమీద ఇంత కాసూ, సున్నం రాసుకొని, పోకవక్క లేసుకొని విడెం నములుతూ, అర్ధ నిమీలిత నేత్రాలతో సేద దీరు తున్నారు. రావిచెట్టు మొదలు దగ్గర, కూర్చున్నచోటే దుప్పటినో కొంగునో పరచుకొని ఆకులు వీచే చల్లగాలిని ఆస్వాదిస్తూ, చుట్టూ వున్న సందడిని పట్టించుకోకుండా చిన్నకునుకు తీస్తున్నారు మరికొందరు. ఆ చిన్నపాటి ఆటవిడుపే మళ్ళీ సాయంత్రం దాకా వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపి శ్రమని తెలియనీయకుండా చేసేది.

సద్దులబండ మీద ఎప్పుడో పురాతనకాలంలో చెక్కిన గీతల మీద పులీ-మేకా ఆటలాడుతున్నారు కొందరు యువకులు.

***

కాలం కూడా - వారితో సమానంగా పులీ - మేకా ఆటలాడింది! కాలం ఎప్పుడూ పులే! మేకలన్నీ కలిసి ఒక పద్ధతి ప్రకారం పులిని కట్టడి చెయ్యక పోగా - కాలం పులి మాత్రం ఒక్కొక్క మేకనే చంపుకు తింటూ.... తింటూ... చూస్తుండగానే సద్దులబండ మీది వైభవాన్ని పూడ్చి పెట్టేసింది!

ఉమ్మడి కుటుంబాల ఊరుగా పేరుబడ్డ ఆ వూళ్ళో - అన్నింటా పంపకాలు జరిగిపోయాయి! వేరు కుంపట్లూ, అడ్డుగోడలతో పాటు చేనుకూ చేనుకూ మధ్య కంచెలు మొలిచిపోయాయి! కంచెలతో కుంచించుకుపోయిన ఆ చేండ్ల వైశాల్యాలతో బాటు, మనుషుల హృదయ వైశాల్యాలూ కుంచించుకుపోయాయి! శివయ్య మాటల్లో చెప్పాలంటే - 'మనుషుల్లో నియనాత్ తక్కయిపోయి, బెఇమాన్‌తనం పెరిగిపోయి' సద్దులబండ దగ్గరి ఆప్యాయతలూ, ఇచ్చి పుచ్చుకోవడాలూ అన్నీ మాయమైపోయాయి.

ఇప్పుడైతే - శివయ్యకున్న ఒక్క కొడుకు రాజయ్య - రాజయ్య భార్య సాయమ్మ ఇద్దరే ఆ సద్దులబండ దగ్గర మిగిలిపోయారు.

***

''ఈ బొమ్మ ఎంత మంచిగున్నదే సాయమ్మా! నా సిన్నప్పటి సందిసూస్తున్నా రోజుకొక తిరంగ గనిపిస్తది నీమెరంగనే! ఒక్కరోజు ఈ బొమ్మను సూడకపోతే ఎట్లనో అనిపిస్తుంది'' భార్య సాయమ్మతో ఎంతో తమకంతో అంటున్నాడు రాజయ్య. కోడి పులుసులో జొన్నరొట్టెను నానేసి, నానిన రొట్టెముక్కలను ఒక్కొక్కటే రాజయ్య చేతి కిస్తున్నది సాయమ్మ. శివపార్వతుల శిల్పాన్ని తానూ రోజూ చూడందే - ఇంటికి వెళ్ళదు సాయమ్మ!

''గందుకేనా! రోజూ ఈ సద్దులబండ మీదనే సద్దిదినాలని పట్టు వడతావు! ఆ బొమ్మను జూసుకుంటూ దింటే ఒక బుక్క ఎక్కవోతది గదా! నాకంటే మంచిగున్నది గదా ఆ బొమ్మ!'' అసూయగా అన్నది సాయమ్మ.

"అదిగాదే బొమ్మను జూసి నిన్ను జూస్తే, నిన్ను జూసి ఆ బొమ్మను జూస్తే అదొక గమ్మతనిపిస్తది! గందుకు!"

"గమ్మతనిపించుకుంటా, గమ్మతనిపించుకుంటా ముగ్గురు నలుగురు పిల్లలు పుట్టేరంటే – ఆయింత పెద్ద గమ్మతు మొదలయితది!" భవిష్యత్తు గురించి ఆందోళనగా అంది.

"మనకేం తక్కవోయిందే! మా తాతలు ఒడిచ్చిన నల్లరేగడి భూమి నాలుగెరకాలు ఉన్నది. దీనికి నా రెక్కల కష్టంతోటి, నీ ఇగురం తోటి ఇంకొక నాలుగెకరలు జమజేద్దాం! అగో! అటు సూడు! తియ్యటి ఊట నీళ్ళ మోటబావి! ఎన్ని తోడితే అన్ని సిడుమల ఊరుతయి! మంచి మంచి ఇతనాలస్తున్నయట! ఎకరంకు ఒక పుట్టి పండేది. నాలుగు పుట్లు పండు తయిట! కరెంటు పంపులస్తున్నయట! మన భూమంతా తడిసిందంటే, నాలుగెకరాలల్ల నలభై ఎకరాల పంట దియ్యకపోతే – గప్పుడను! నలుగురు గాదు పదిమంది కన్నా మనకేం తక్కవోదు!" భూమి ఇచ్చిన ధీమాతో అన్నాడు రాజయ్య!

"పదిమందిని గంటడట పెద్ద మొగోడు! ఎండ బాగున్నది గని, రెండాటలు పచ్చీసు ఆడదాంరా బావా! అప్పటిదాకా సల్లవడతది! మల్ల అరక పడుదువుగాని!" అంటూ పచ్చీసు సంచిదీసి పరిచి గవ్వలు పేర్చింది సాయమ్మ.

పచ్చీసు ఆటంటే మహా ఇష్టం సాయమ్మకు. సంతకువోయినప్పుడు ప్రత్యేకంగా తానేఏరుకొని మంచి మఖ్‌మల్‌బట్ట, రంగురంగుల పూసలూ, దారాలూ దెచ్చుకొని స్వయంగా కట్టుకున్నది పచ్చీసును. సాయమ్మతో రెండాటలు పచ్చీసు ఆడితేనే సాయంత్రం దాకా హుషారుగా పని చేస్తాడు రాజయ్య

***

నాలుగెకరాల నాణ్యమైన మాగాణిలో – పచ్చని తమలపాకుతోట ప్రక్కన. తియ్యని ఊట నీళ్ళ మోట బావి ఒడ్డున – ముదురాకుపచ్చ రావి చెట్టు చల్లని నీడలో – శతాబ్దాల చరిత్ర గలిగిన సద్దులబండ మీద – రంగురంగుల పూసలతో అల్లిన పచ్చీసు గడుల మీద ఎత్తుకు పై ఎత్తు వేస్తూ, నవ్వుతూ, తుళ్ళుతూ – రోజూ పచ్చీసు ఆడుతూనే వున్నారు.

సమాంతరంగా – కాలం – కూడా తన పావులను కదుపుతూ వారి బతుకులతో పచ్చీసు ఆట ఆడింది! మనుషుల్లో నియ్యత్ (నీతి) లేక పోవడంతో – తాను నియ్యత్‌ని (నీతిని) వదులుకొని, వరుసలు మరచి పోయి మరీ 'లొత్తిడి' ఆట ఆడుతున్నది! ఆ సంగతి తెలియని సాయమ్మ, రాజయ్యలు మనసారా నవ్వుతూ ఆడుతూనే వున్నారు.

***

"ఏడ్వకయ్యా! ఎందుకేడుస్తవు! ముందు గింత బువ్వదిను బావా!"

గుంతలు పడిన శివయ్యకళ్ళ నుండి, ముడతలు పడిన చెంపలమీదుగా బొట్టు బొట్లుగా రాలుతున్న కన్నీటి చుక్కల్ని, చిరిగిన తన పైట కొంగుతో మెల్లగా తుడుస్తూ, మరో చేత్తో తన కన్నీళ్ళను తుడుచుకుంటున్నది సాయమ్మ.

పాత సత్తుడబ్బాలో ముక్కిపోయిన దొడ్డు బియ్యపు అన్నం. పల్చటి నీళ్ళ పప్పు! అన్నాన్ని పిసికి మెత్తగా జేసి పప్పులో ముంచి రాజయ్య బోసి నోటికి అందిస్తోంది. అదే సద్దులబండ! అదే జంట! కాలం లొత్తిడి ఆట ఫలితం! కంటికి కనిపించకుండా, ఆనవాళ్ళు సైతం మిగలకుండా మాయమైపోయిన తన నాలుగెకరాల నల్లరేగడి భూమి, తమలపాకుల తోట. ఊట నీళ్ళమోట బావి గుర్తుకొచ్చి రోజుకొకసారైనా ఏడుస్తాడు రాజయ్య.

"మరి ఇప్పుడు ఏడిస్తే ఏమస్తది! అయిపోయింది మన కాలం! మా రాజుల్లాగా బతికినం! సాలు! ఈ కాలం ఎట్లన్నా సావనీ. మనకెందుకు! మనమయితే మంచికాలంల బతికినం! సాలు! ఇగ దానికోసం రోజూ ఏడుస్త నంటే ఎట్లా!" అనునయిస్తోంది.

"ఇప్పటి పోరగాండ్లు ఆ దండికాలం సూడకనే పాయిరి! ఇప్పుడు జూసేదే దండిదనుకుంటున్నారు. మనకు సూనుకునతందుకు ఇగో! ఈ సద్దులబండన్నా మిగిలింది! ఈళ్ళకేం మిగుల్తది! ఏమి మిగులది! ఒక్కొడికన్నా సోయలేదు!"

"అరేయ్ ముసులోడా! ఏమదుర్తున్నావు ఊకె! నోర్మూసుకొని ఉండు – ఈడ లొల్లివెట్టకు! దూరం బోయి గుసుండుపో!" పక్కింటి యువ వాచ్‌మెన్ రాజయ్యను బెదిరించాడు.

తన కళ్ళముందే ఒక్కొక్కటిగా మాయమవుతూ – మారిపోతూ తను పుట్టి పెరిగిన ఊరు, పరిసరాలు గుర్తు పట్టలేనంతగా మారిపోవడం ఇప్పటికీ నమ్మబుద్ధి గాదు రాజయ్యకు! పట్టణాల్లో కట్టుదెంపుకొని పల్లెల మీద పడ్డ రియల్ ఎస్టేట్ వ్యాపార భూతం – డబ్బు అందించే విలాసాలకు మోహం వాచిపోయి వున్న పల్లె జనాలకు, నోట్ల కట్టలను ఎరగా వేసి, ప్లాట్లు లేఅవుట్ల రూపంలో, పచ్చని పంట పొలాలను ఆవురావురమంటూ మింగుతూ వస్తున్న క్రమంలో – రాజయ్య మాగాణి కూడా ఆ భూమేధానికి బలిగాక తప్పలేదు.

కొన్నాళ్ళు తన భూమిని ఛస్తే వదలనని మొండికేశాడు రాజయ్య. వదలకపోతే 'బలవంతంగా సర్కారు గుంజుకుంటుందని' భయపెట్టారు. అప్పటి దాకా తండ్రికి మర్యాదగా చెప్తూ వస్తోన్న కొడుకులు అమర్యాదకి కూడా దిగడంతో నిస్సహాయుడైన రాజయ్య ఆ ఉప్పెనలో కొట్టుకుపోక తప్పలేదు. తన భూమిలో రకరకాల పేర్లతో కాలనీలు, భవంతులు పుట్టుక రావడానికి సాక్షిగా నిలవడం తప్ప మరేమీ చేయలేక పోయాడు. పోనీ–వచ్చిన డబ్బుతో అవసానదశలోనైనా కడుపు నిండా తిండి తిందా మనుకున్నా కుదరలేదు. చదువురాని తనను కన్న కొడుకులే మోసం చేసి వచ్చిన డబ్బులన్నీ పంచుకొని సుఖాలనుభవిస్తూ, ఏదో దయతలచి విదిల్చిన డబ్బుతో కాలం నెట్టుకొస్తున్నారు రాజయ్య, సాయమ్మ.

ఇప్పుడా వూళ్లో న్యాయం చెప్పేవాళ్ళు కూడా పొలాలు మాయమైనట్లే మాయమై పోయారు. డబ్బున్న వాడిదే న్యాయం! దుడ్డున్నవాడిదే రాజ్యం!

ఒకప్పుడు నగిషీలు చెక్కిన వెండి తాపడపు చిరుగజ్జెల ములుకోల పట్టు కున్న రాజయ్యచేతిలో ఇప్పుడు సగం విరిగి పేడులు బయటపడిన లాఠీ కర్ర వుంది. చిలకపచ్చ అంచు మసిరేసే ధోవతి, పైన మల్లెపువ్వు లాంటి బొందెల అంగీ తొడిగి, భుజం మీద జరీ అంచు దుశ్శాలు వేసుకొని, కిర్రుచెప్పులతో, నాలుగెకరాల తన రాజ్యంలో – రాజులా నడిచిపోయే రాజయ్య – పాత ఖాకీ ప్యాంటు మీద రంగు వెలిసిన పాత టీ షర్టు వేసుకొని, నడమంత్రపు సిరి కలిసొచ్చిన ఓ దౌర్భాగ్యుడి ఇంటి ముందు వాచ్‌మెన్‌గా కాపలా కాస్తున్నాడు.

సద్దులబండ పక్కనే వెలిసిన ఆ భవంతి ముందే కాపలాగా వుంటానని ఆ ఇంటి యజమానిని బ్రతిమాలి మరీ ఒప్పించడానికి కారణం!

ఆ భవనపు పునాదుల కిందనే తన తియ్యని ఊట నీళ్ళ మోట బావి సమాధి చేయబడి వుంది! ఆ భవనపు పెరట్లోనే తన పచ్చ పచ్చని తమల పాకు తోట మళ్ళీ చిగర్చకుండా పాతి పెట్టబడి వుంది! ఆ భవనపు ముంగిట్లోనే చల్లగాలి దీవెనలు వీచే ముదురాకు పచ్చ రావిచెట్టు మొదలంటా నరకబడి మట్టిలో కలిసిపోయి వుంది!

కానీ సద్దులబండ మాత్రం బయట – అలాగే మిగిలిపోయి వుంది! దాన్నేమి చేయలేమని, దాని మూలాలూ చాలా లోతులో వున్నాయని ఈ 'ఆధునిక భవన నిర్మాణ శిల్పులు!' చేతులెత్తేయడంతో – తర తరాలుగా వస్తోన్న ఒక గొప్ప వారసత్వపు సంస్కృతీ వైభవానికి గుర్తుగా – నిశ్చలంగా, నిర్మలంగా ఆ సద్దులబండ మిగిలిపోయి వుంది! దాని మీద చెక్కబడిన శివపార్వతుల ఆలింగనా దృశ్యం ఇప్పటికే అంతే సమ్మోహనకరంగా వుంది!

❑

రచయిత సెల్ నెం: 94402 29728



## బతకనేర్చిన చార్మి...

హీరోయిన్‌గా అవకాశాలు తగ్గిపోవడంతోనే నిరాశపడిపోతూ ఇంట్లో కూర్చోకుండా, వేరే మార్గాల ద్వారా డబ్బు సంపాదించే పద్ధతిని ఎంచుకుంది చార్మి. వేరే మార్గాలంటే అపార్థం చేసుకోకండి. సినిమాల్లో కాకుండా యాడ్స్‌లో బిజీ అయిపోయింది. రెమ్యూనరేషన్ దగ్గర పెద్దగా పట్టుబట్టకుండా వచ్చిన యాడ్స్ అన్నీ చేసేస్తోందట! 'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న' సామెతను అక్షరాలా ఫాలో అయిపోతూ రెండు చేతులా సంపాదించేస్తోందట!అన్నట్లు సంపాదించిన డబ్బుతో ముంబాయి, చెన్నైలలో పెద్ద ఎత్తున ఆస్తులు కూడా కొనేస్తోందట! ఇంకేం ఓ రెండు మూడు సంవత్సరాల తరువాత కాలు మీద కాలేసుకొని కూర్చుని హాయిగా తినొచ్చును!